

# ఇదీ ఒక క్వసీ కథ

## కృష్ణ. ఎం. ప్రసాద్

"బర్ర్ర్ ... బర్ర్ర్" అంటూ శబ్దంచేస్తూ ఆగిపోయింది కారు.

"వాట్ హాపెన్డ్ ? !"

"ఏమయిందోయ్ కారుకు..."

"ఇంజన్ ట్రబుల్ యిస్తున్నది సార్ !" అది డ్రైవరు సమాధానం.

"ఓ మై గాడ్ ! ..."

"అరి ! భగవంతుడా..." లోపలి వాళ్ల దీనాలాపాలు యివి.

డ్రైవరు కారు దిగి ఇంజనును పలకరించి చూశాడు. రెండు నిముషాలపాటు అవీ యివీ వైర్లు కదిలించాడు ఆడించాడు విదిలించాడు. బ్యాటరీని టెస్ట్ చేశాడు. మళ్లీ వచ్చి సీట్లో కూర్చుని ట్రై చేశాడు. మళ్లీ మళ్లీ ట్రై చేసి చూశాడు. ఉహూఁ! ఏమీ లాభంలేకపోయింది.

"ఏమిటి సంగతి ?" అడిగారు యజమాని రాజుగారు.

"మీరు ఏం అనుకోకపోతే ఒక నిమిషంపాటు దిగి తొయ్యాలి సార్!" వినయంగా నసిగాడు డ్రైవరు జేమ్సు.

తప్పదన్నట్లుగా చూసి ఆముదం తాగిన మొహాలుపెట్టి క్రిందకు దిగారు – రాజుగారు, ఆయన బావమరదిగారు.

ఒకటీ ... రెండు ... మూడు ... పది గజాలు తోసేసరికి అలుపు వచ్చినట్లుంది వారికి, గట్టిగా నిట్టూరుస్తూ ఆగిపోయారు.

"అవునుమరి అసలే పెద్ద శరీరాలు, అందునా అలవాటులేని పని. పైగా ఇంకో రెండు భారీ శరీరాలు అంటే వారి సతీమణుల కాయములు యింకా కార్లోనే వున్నాయి. కష్టమేకదా !" మనస్సులోనే అనుకున్నాడు జేమ్సు.

"అమ్మా! మీరుకూడా దిగితే..." మధ్యలోనే ఆపేశాడు.

సుఖంగా వెనక సీట్లో కూర్చున్నవారికి కారం రాసినట్లు బాధపడ్డారు. కాని తప్పదుగా, దిగారు.

మళ్లీ తోశారు. ఈసారి నలుగురు. పదండి ముందుకు ... పదండి తోసుకు ... కానీ ఏం లాభం లేకపోయింది. ఒకటి కాదు, రెండు కాదు ఐదారు నిముషాలపాటు తోసినా ఫలితం శూన్యం. మళ్లీ పడింది బ్రేక్.

"ఇందాక డిన్నర్లో తిన్నదంతా అరిగి వుంటుంది. ఇక చాల్లే ఈ బండీ తోపుడు పని..." అనుకున్నాడు జేమ్స్. కారు దిగి బయటకు వచ్చాడు.

"ఇక లాభంలేదు సార్! ఇంజన్ వర్క్ చేయనంటున్నది. ఇంకా యాభై మీటర్లు పైగా వుంది పెట్రోల్ బంక్. ఏం చేద్దాం ?" జేమ్స్ ప్రశ్న.

"అంత దూరం నేను తోయలేను. ఇక చాలు యీ సర్కస్ పని !" ఆయాసపడిపోతున్న రాజుగారి బావమరిదిగారి సమాధానం.

తనను ఎవరైనా ఎరిగున్నవారు చూస్తారేమోనని భయం భయంగా రోడ్డుమీదకు అటూ యిటూ చూశారు రాజుగారు. అయినా ఎవరు వస్తారులే ఇటుగా యింత రాత్రివేళ అన్న ధీమా వున్నా, మనస్సులో ఏదో మూల పీకుతూనే వుంది. ఇంకా యింటికి చేరాలంటే నాలుగైదు మైళ్ళు పోవాలి. అంత దూరం, అమ్మో, నడవ గలమా ?

రోడ్డుమీద అడపాదడపా ఆర్టీసీ బస్సులు, పెద్ద శబ్దంతో పోతూన్న లారీలూ, ఒకటీ అరా కార్లు పోతూనేవున్నాయి. ఒకరుకూడా తమ సంగతి పట్టించుకున్నవారు లేరు. లిఫ్ట్ కావాలా అని అడిగినవారు అసలే లేరు ... ఇడియట్సు.

* * *

'జేమ్స్ టైం చూసుకున్నాడు. అలా టైం చూడడం యిది అతనికి ఏ పదోసారో టైం

పది గంటలు దాటింది. అంటే తాను అక్కడకు వచ్చి ఐదుగంటలు దాటిందన్నమాట.

అతను రావ్ అండ్ రావ్ కంపెనీలో డ్రైవర్. రాజుగారు ఆ కంపెనీకి మేనేజింగ్ పార్టనరు. ముఖ్యమైన స్నేహితుడింట్లో ఫంక్షన్ ఏదో వుంటే సిటీకి ఇరవై మైళ్ళ దూరంలో వున్న ఆ ప్రాంతానికి వచ్చారు ఆయన.

జేమ్స్‌కు చాలా విసుగ్గా వుంది. అంతవరకూ అతన్ని పలకరించినవారు లేరు. తన లోపల ఆత్మారాముడు గోల చేస్తూంటే, పెద్ద తోటలో మధ్యలో రాజభవనంలా వున్న ఆ బిల్డింగ్ లోపల భోజనాలు ముగించినట్లున్నారు. హడావిడి తగ్గి, గోల అంతగా వినిపించటంలేదు. తనకోసం మేరి యింకా ఎదురుచూస్తూనే వుంటుంది, ఇంటివద్ద. కనీసం తనైనా మీల్సు చేసిందో లేదో. వెధవ ఉద్యోగం ఇది ఒక్కొక్కసారి అంతే. కానీ అప్పుడప్పుడు అనుకోకుండానే బక్షీస్ కింద ఐదూ పదీ దొరుకుతునేవుంటాయి. అందుచేతనే యిదివరలో యెన్ని ఉద్యోగాలు మారినా మూడేళ్ళుగా యీ కంపెనీలోనే వుంటున్నాడు ... యిలా సాగుతున్నాయి అతని ఆలోచనలు.

మరో అరగంటకుపైగా కాలం గడిచింది.

ఆ ఫ్రెండ్ దగ్గర సెలవు తీసుకొని రాజుగారు, ఆయన బావమరిదిగారు, వారి భార్యామణులు విందులోని వంటకాల గూర్చి మాట్లాడుకుంటూ స్వీట్స్‌ను తలంచుకొని కిళ్ళీ నములుతూ వచ్చి కార్లో సుఖాసీనులయ్యారు.

కారు బయలుదేరింది. అప్పుడు టైం పదకొండు గంటల పది నిముషాలైనట్లు రికార్డు చేసుకున్నాడు మనస్సులోనే జేమ్స్.

తనేమో ఆకలితో వుంటే వీరేమో పీకలదాకా మేసిందేకాక యింకా ఆ విందు గురించే మాట్లాడు కోవటం అతనికి చాలా బాధగా వుంది. అంతలోనే ఒక కొంటె ఆలోచన మనస్సులోకి తళుక్కున ప్రవేశించింది. అంతే...

* * *

"సార్! నేను పోయి బంక్ దగ్గర ఏదైనా టాక్సీగాని ఆటోగాని దొరుకుతుందేమో చూసిరానా." వినయంగా అడిగాడు డ్రైవర్.

"ఆఁ" నిద్రలోంచి పూర్తిగా మేల్కొనని వాడికిమల్లేనే వుంది ఆయన స్వరం. ఇప్పుడు టాక్సీలో ఇంటికి పోవాలా? దానికి పదిరూపాయల ఖర్చు. పైగా యీ కారును బంక్ దాకా తోయటానికి కూలీ, దీని రిపేరుకు మళ్లీ ఎంతో? ఆయన మెదడు "కాలుక్లేటర్" లాగా ఖర్చును అంచనా వేయటానికి ప్రయత్నిస్తుంటే, మనస్సు ఆ ఖర్చుకు తెగ బాధపడిపోతున్నది. ఆడవాళ్లిద్దరూ ఏమిటీ న్యూసెన్స్ అన్నట్లుగా చూస్తున్నారు. వారికి భుక్తాయాసంతోపాటు అలుపు బాధిస్తుంటే, చల్లగాలికి నిద్ర వచ్చేస్తోంది.

"అల్లాగే కారును బంక్ దాకా తోయటానికి యెవరైనా దొరుకుతారేమోకూడా చూడు. త్వరగా." అన్నాడు రాజుగారి బావమరిది ధైర్యంచేసి. ఆయనకుకూడ నిద్ర ముంచుకు వచ్చేస్తోంది.

ఐదు నిముషాల్లో తిరిగివచ్చాడు జేమ్స్ ఓ టాక్సీలో. అతనితోపాటు మరో ముగ్గురు పర్కర్లు కూడా వున్నారు.

"మనం అదృష్టవంతులం సార్! సమయానికి అక్కడే టాక్సీ వుంది. లేకపోతే..."

"సరి సరి. వాళ్లకు ఎంతివ్వాలో ముందది చెప్పు." అతని మాటలను మధ్యలోనే అడ్డుకున్నారు ఆయన.

"ఫిఫ్టీన్‌రుపీస్. నేను రేపు మార్నింగ్ వచ్చి కారును రిపేరు చేయించి తీసుకువస్తాను మీరిప్పుడు టాక్సీలో వెళ్లండి." అన్నాడు జేమ్స్.

"సర్లే" అంటూ రాజుగారు పర్సులోంచి రెండు పదిరూపాయల నోట్లు తీసి అతనికిచ్చి, "మిగిలింది నువ్వు తీసుకో. రేపు ఎనిమిదింటికే యింటికి రా. అప్పుడు చూద్దాం కారు సంగతి." అన్నారు.

"ఎస్సార్!"

టాక్సీ కదిలింది.

కారును బంకుకు చేర్పించి ఆ పర్కర్లకు తలో రెండురూపాయలు యిచ్చి పంపేశాడు జేమ్స్. తనను ఆకలితో అంతసేపు వుంచినందుకు అయ్యగారికి యిప్పటికే ముప్పైరూపాయలదాకా క్షవరం. ఇంకా రేపు మార్నింగ్ మరో ట్వెన్‌టీ, ట్వెన్టీఫైవ్ — నవ్వుకున్నాడు.

రోడ్డుమీద వీస్తున్న చల్లగాలికి అప్పటిదాకా వున్న విసుగు పారిపోయింది. గబగబ నడుస్తే అరగంటలో యింటికి చేరవచ్చు. పెట్రోల్ బంక్ పక్కనే వున్న టీ బంకులో నాలుగు సమోసాలు తిని కప్పు టీ తాగేసరికి హుషారు వచ్చింది అతడిలోకి. మెల్లగా నడక సాగించాడు, రేపు కారు రిపేరింగుకు యెంత బిల్ చెయ్యాలా అని ఆలోచిస్తూ.

అతని కడుపులోని ఆకలి చల్లారింది కొంతవరకూ.

అతని మనస్సులోని కసీ పోయింది చాలా వరకు.

## సామాన్యుని సణుగుడు

### ఎక్కడుంది లోపం?

మొన్ననే నో స్నేహితుడు మొదటిసారి కాబోలు మన "ఆంధ్రప్రదేశ్" వచ్చాక హైదరాబాద్ వెళ్లి వచ్చాడు... గొప్ప చిట పట లాడిపోతున్నాడు. అంత పెద్ద ప్రపంచ సభలు జరిగాయి — ఐనా అక్కడ యింకా తెనుగు మాట్లాడేవాడు — రిక్షా ఎక్కడం కష్టం — ఆటో బేరమాడుకోడం కష్టం — సిటీబస్‌లో దుకాణాల్లో అన్నిచోట్లా యింకా "కచ్చా పచ్చా" వుర్దూ ముక్కలు వస్తేనే తప్పు గడవటంలేదు" అన్నాడు.

తెనుగోడి గోడు పాత అయిపోయిందేమోనే యిప్పుడు తెనుగు తల్లి తీయతీయని తేనెపల్కుల వరదలు మన భాగ్యనగరాన్ని మరింత సంపన్నం చేస్తున్నాయి అనుకున్నామే — మరి యీ "భాషా జులుం" యింకా మన రాజధానిలో తగ్గకపోట మేమిటని?

దేశంలో ఏ మూల ప్రాంతంవాడైనా, మరో మూల కొచ్చి రిక్షాలు, ఆటోలు, టాక్సీలు టీ దుకాణాలు అవీ నడుపుకోవచ్చును. కాని — దానికి ముళ్కిలే వుండనక్కరలేదుగని - సహజంగా ఆ పరాయివాడు స్థానిక భాషని నేర్చుకోవాలి అంతే గాని — సొంత రాజధానిలో మరో భాషలో పని పాటలు చూసుకునే దుస్థితి తెనుగు భాషా వుద్యమాలు తెనుగు ప్రచారాలు, మహా సభలు జరిగాకా కూడా తప్పదూ అంటే... లోపం ఎక్కడో వుండి వుండాలె... అది తెనుగు భాషలోనా? తెనుగువాడి లోనా? అంటే తెనుగు భాషలో కాదూ, తెనుగు వాడిలోనే అని — మనం చెప్పకోవాలి.

"హైద్రాబాద్‌కి పోగానే "ఆంధ్ర రాజధానీ నగరం యిది నాది" అనిపించాలి తెలుగువాడికి. మలేషియాలో, మారిషస్‌లో, మైసూర్‌లో మరో ఏరియాలో ఎక్కడి కెళ్లినా తెనుగు నాలిక చేసే తెనుగు శబ్దాలకు ఆదరణా విలువా వున్నాయి. "శ్రవణపేయమైన జీవద్భాష మనది అని భుజాలు పొంగదీసుకుంటే ప్రయోజనం లేదం"ది పురో యిల్లాలు...

"తెనుగులో మాట్లాడండి. తల్లి భాష తెనుగును ఆదరింపుము" అని బోర్డులు ట్రాఫిక్ సిగ్నల్సు ప్రక్కనే వ్రేలాడదీస్తే ఎలా వుంటుంది? అన్నాను నేను. ఒహో! మాట్లాడండి మనం కాదు, అక్కడివాళ్లు. పోలీసు కానిస్టేబుల్ కూడా "ఏమండీ" అంటే "క్యాహై" అన్నాడు ఆబిడ్స్‌లో అని మరో కంప్లెయింటు...

"సరే రేడియోలో చెప్పించాలి యిక లేదా తెనుగులో మాట్లాడుతాను అంటే తప్ప ఆటో రిక్షాలకి, టాక్సీ డ్రయివర్‌లకి వాటిని తోలే అవకాశం యివ్వగూడదు ..." అన్నాను.

"ఇది బెటరేగాని ఏదో పనిమీదో మట్టం మావుగా వెళ్ళేవాళ్లలో తెనుగులో మాట్లాడి, ముక్కుపిండి అవకతవక రేట్‌లు యిచ్చుకోలేరుగాని— అక్కడ తెనుగులో దైనందిన జీవనం సాగాలీ అంటే అక్కడికిపోయి యిల్లూ వాకిలీ, పెళ్లాం పిల్లలూ అన్నీ చూసుకుని సెటిల్ అయిపోయిన "ఆంధ్రా బాబు"లే రోజూ రిక్షా రేట్లు అవీ తెల్సినవారై వుంటారు కనుక—పనిగట్టుకుని తెనుగు మాటాడితే తప్ప—మన రాజధానీ నగరంలో తెనుగుతల్లికి కేవలం విగ్రహాలే మిగులుతాయికాని, మల్లెపూల మాలల గుబాళింపులు మాత్రం అందవు అని సణిగి సణిగి— నేను యింగ్లీష్‌లో కొంచెం విసుగు చూపించాకా వెళ్లాడు ... మా నేస్తం పాపం! అదీ విషయం.

[ పిరాజీ ]